నమస్తే తెలంగాణ
# సంగారెడ్డి
I హైదరాబాద్, గురువారం 29 మే 2025 SANGAREDDY



సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో విత్తనాలు కొనుగోలు చేస్తున్న రైతు వెంకటయ్య

# సాగుకు సన్నద్ధం

## రోహిణికార్తె రాకతో రైతులు బిజీ బిజీ



సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలంలో విత్తనాలు వేస్తున్న దృశ్యం(ఫైల్)

- సిద్దిపేట జిల్లాలో దుక్కులు దున్నే పనుల్లో రైతులు నిమగ్నం
- అకాల వర్షాలతో తడిసిన వ్యవసాయ భూములు
- ఈ సంవత్సరం పెరగనున్న సాగు భారం

గజ్వేల్, మే 28: రోహిణికార్తె ప్రవేశంతో సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా రైతులు వానకాలం పంటల సాగుకు సన్నద్ధమవుతున్నారు. గత వారం కురిసిన భారీ వర్షంతో వ్యవసాయ భూములు తడిసి ముద్దయ్యాయి. ముందస్తుగా కురిసిన వర్షాలకు రైతులు అప్పుడే ఒకసారి దుక్కులు దున్ని విత్తనాలు విత్తేందుకు సిద్ధం చేశారు. రోహిణికార్తెలో వర్షాలు కురిసిన వెంటనే అనుకున్న సమయానికి విత్తనాలు వేసుకునేందుకు దుక్కులను సిద్ధం చేసుకుంటున్నారు. ఆదివారం నుంచి రోహిణి కార్తె రాకతో వానకాలం సీజన్ ప్రారంభమైంది. సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా ఈ సంవత్సరం సుమారు 5.50లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలను రైతులు సాగు చేస్తారని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. జిల్లా వ్యాప్తంగా 2.50 లక్షల మంది రైతులు ఉండగా వీరిలో చాలామంది రైతులు వర్షాలను ఆధారంగా చేసుకొని పంటలు సాగు చేస్తున్నారు. కొంత మంది రైతులు నీటి ఆధారిత పంట వరి సాగును ఎక్కువగా చేపడుతున్నారు. నీటి వసతు లున్న రైతులు ముందస్తుగా దీర్ఘకాలిక రకం వరి సాగు చేస్తారు. ఈ సారి జిల్లావ్యాప్తంగా సుమారు 3.50లక్షల ఎకరాల్లో వరిసాగు చేసేందుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. రోహిణికార్తె రాకతో రైతులు వరినార్లు పోసుకునేందుకు విత్తనాలను సిద్ధం చేసుకుంటున్నారు. 1.20లక్షల ఎకరాల్లో పత్తి, 30 వేల ఎకరాల్లో మొక్కజొన్న, 6 నుంచి ఏడువేల ఎకరాల్లో కందులు, మరో 40వేల ఎకరాల్లో ఇతర పంటలు సాగు చేసే అవకాశాలు ఉన్నాయి. ఇందుకు సంబంధించి డిమాండ్‌కు తగిన విధంగా ఎరువులు రైతులకు అందుబాటులో ఉంచేలా వ్యవసాయాధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

### పెరగనున్న సాగు భారం

రైతులపై సాగు భారం రోజురోజుకూ పెరుగుతున్నది. వానకాలం పంటల సాగుకు అప్పుడే రైతులు వేసవి దుక్కులను దున్ని సిద్ధం చేసుకున్నారు. రోహిణికార్తెలో విత్తనాలు వేసుకునేందుకు అనువైన కార్తె కావడంతో రైతులు మరోసారి దుక్కులు దున్ని విత్తనాలు విత్తేందుకు సిద్ధమవుతున్నారు. పెట్రోల్, డీజిల్ ధరలు విపరీతంగా పెరగడంతో రైతులపై మరింత పెట్టుబడిభారం పడుతున్నది. గతంలో కాడెడ్లతో సాగు పనులు చేసేవారు. కానీ కాలానుగుణంగా ఎక్కడా అలాంటి పరిస్థితులు ఎక్కువగా కనిపించడం లేదు. ఎక్కువ శాతం రైతులు ట్రాక్టర్‌తో దున్నే పనులు చేపడుతున్నారు. ఒక్కో గ్రామంలో 15 నుంచి 20 వరకు ట్రాక్టర్లు ఉండగా ఇంధనభారం అధికమవుతున్నది. ప్రస్తుతం కురిసిన వర్షాలతో వానకాలం సాగు పనులు ప్రారంభం కావడంతో ట్రాక్టర్ల యజమానులు బిజీ బిజీగా మారారు. ప్రస్తుతం ఎకరాకు రూ.25 వేల నుంచి రూ.30వేల వరకు అన్ని రకాల ఖర్చులు అవుతాయని రైతులు వాపోతున్నారు. గతంతో పోల్చితే ఈ సంవత్సరం ట్రాక్టర్ దున్నేందుకు ధరలు పెంచడంతో రైతులపై భారం పడుతున్నది. దీనికి తోడు కూలీల కొరత, ఇతర పెట్టుబడి ఖర్చుల వినియోగం విపరీతంగా పెరుగుతున్నది. ప్రతి సంవత్సరం రైతులపై సాగుభారం పడుతున్నది.



సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం మూట్రాజ్‌పల్లిలో దుక్కి దున్ని సిద్ధం చేసిన రైతు

# లండన్‌లో కేటీఆర్‌కు స్వాగతం పలికిన కోహెడవాసి

కోహెడ, మే 28: బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ లండన్ వెళ్లగా బుధవారం అక్కడి విమానాశ్రయంలో సిద్దిపేట జిల్లా కోహెడ మండలం వరికోలు గ్రామానికి చెందిన సంది సంకీర్త్‌రెడ్డి అనుచరులతో కలిసి ఘన స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛం అందజేశారు.జై తెలంగాణ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.



లండన్‌లో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు స్వాగతం పలుకుతున్న సంకీర్త్‌రెడ్డి

# మానవ మనుగడకు మొక్కలు అవసరం



సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం ప్రజ్ఞాపూర్‌లో మొక్క నాటుతున్న రాజేశ్వర్‌రావు, అనిల్

గజ్వేల్, మే 28: మానవ మనుగడకు మొక్కలు పెంచడం ఎంతో అవసరమని గ్రీన్ ఇండియా చాలెంజ్ సిద్దిపేట జిల్లా కన్వీనర్ చేప్యాల రాజేశ్వర్ రావు అన్నారు. బుధవారం గ్రీన్ ఇండియా చాలెంజ్‌లో భాగంగా సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి అనిల్ పుట్టినరోజు సందర్భంగా గజ్వేల్ మండలం ప్రజ్ఞాపూర్‌లో ఆయనతో కలిసి మొక్క నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాజీ ఎంపీ సంతోష్‌రావు చేపట్టిన గ్రీన్ ఇండియా చాలెంజ్‌లో భాగంగా మొక్క నాటడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో హరితసేన సభ్యులు లోకేశ్, కార్తీక్, శ్రీకాంత్‌రావు,సతీశ్‌రెడ్డి పాల్గొన్నారు.

# ప్రతి గింజనూ కొనుగోలు చేస్తాం

మిరుదొడ్డి, మే 28 : రైతులకు ఇబ్బందులు లేకుండా ప్రతి ధాన్యం గింజనూ కొనుగోలు చేస్తామని సిద్దిపేట జిల్లా అదనపు కలెక్టర్ గరిమాఅగర్వాల్ అన్నారు. బుధవారం సిద్దిపేట జిల్లా తొగుట మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామన్నారు. అన్ని కొనుగోలు కేంద్రాల నుంచి వెంట వెంటనే ధాన్యాన్ని తరలించాలని అధికారులకు ఆమె సూచించారు. కార్యక్రమంలో తొగుట తహసీల్దార్ శ్రీకాంత్, ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, ఏవో మోహన్, ఏపీఎం శ్రీనివాస్, ఆయా శాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు.



సిద్దిపేట జిల్లా తొగుటలో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ గరిమాఅగర్వాల్

# ప్రయాణం.. ప్రమాదం..



మెదక్-ఎల్కతుర్తి రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా సిద్దిపేటలో ఎల్లమ్మగుడికి వెళ్లే దారిలో ఆగిపోయిన బ్రిడ్జి నిర్మాణ పనులు

*ఈ చిత్రాల్లో కనిపిస్తున్న రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారింది. సిద్దిపేట నుంచి ఇల్లంతకుంట వరకు చేపడుతున్న రోడ్డు విస్తరణ పనులు అసంపూర్తిగా ఆగిపోవడంతో రాకపోకలకు వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అడపాదడపా కురుస్తున్న వర్షాలకు ఈ రోడ్డు గుండా రాకపోకలు సాగించాలంటే ఆయా గ్రామాల ప్రజలు, వాహనదారులు నరకం అనుభవిస్తున్నారు. రోడ్డుపై భారీ గుంతలు ఏర్పడడంతో, వర్షానికి గుంతల్లో నీరు నిలిచి వాహనదారులు ప్రమాదాల బారినపడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు పనులు వేగంగా పూర్తి చేయాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.*

– సిద్దిపేట స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నమస్తే తెలంగాణ, మే 28



లింగారెడ్డిపల్లి-ఇల్లంతకుంట రోడ్డులో వాహనదారుల ఇబ్బందులు





సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని బైపాస్ రోడ్డు మార్గంలోని బ్రిడ్జి కింది నుంచి పారుతున్న వరద

# జహీరాబాద్‌లో భారీ వర్షం

- నిలిచిపోయిన విద్యుత్ సరఫరా • నేలరాలిన మామిడి పండ్లు • ఇబ్బందులు పడ్డ ప్రజలు

జహీరాబాద్, మే 28 : సంగారెడ్డి జిల్లా జహీరాబాద్, మొగుడంపల్లి, ఝరాసంగం మండలాల్లో బుధవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. రుతుపవనాల ప్రభావం వల్ల మేఘాలు కమ్ముకుని ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం పడింది. జహీరాబాద్ పట్టణంలోని ప్రధాన రోడ్లతో పాటు మురుగుకాల్వల్లో వరద పొంగిపొర్లింది. దీంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. జహీరాబాద్ పట్టణంలోని పలు చోట్లగాలికి చెట్ల విరిగిపోయాయి. విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఆయా మండలాల్లో కూడా భారీ వర్షం కురిసింది. గ్రామాల్లో మామిడికాయలు నేలరాలాయి.

**ఝరాసంగం మండలంలో**

ఝరాసంగం,మే 28 : సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండలంలో వర్షం పడింది. ప్యారవరం సమీపంలోని వాగు ఉధృతంగా ప్రవహించడంతో అది దాటడానికి ప్రజలు ఇబ్బందులు పడ్డారు.



సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండలం ప్యారవరం సమీపంలో ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు

# అందుబాటులో ఎరువులు, విత్తనాలు

- మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్
- చేగుంటలోని ఫర్టిలైజర్ షాపు తనిఖీ
- నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

చేగుంట,మే 28: రైతులకు కావాల్సిన ఎరువులు,విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. మెదక్ జిల్లా చేగుంటలోని శ్రీనివాస ఫర్టిలైజర్ షాపును బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. షాపులోని ఎరువులు,విత్తనాల బ్యాగులను పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు ఉంటాయని, పీడీ యాక్టు నమోదు చేయిస్తామన్నారు. మందులు, విత్తనాలను గడువుతేదీలోపు విక్రయించాలని సూచించారు. జిల్లావ్యాప్తంగా పోలీస్, వ్యవసాయశాఖ, రెవెన్యూశాఖల ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్స్ బృందాలతో తనిఖీలు చేయిస్తున్నట్లు తెలిపారు. సకాలంలో రైతులకు ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు అందేవిధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మెదక్ జిల్లాలో 8115 మెట్రిక్ టన్నుల యూరియా, 745 మెట్రిక్ టన్నుల డీఏపీ,2738 మెట్రిక్ టన్నుల పొటాష్, 450 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువులు, 280 మెట్రిక్ టన్నుల సూపర్ ఫాస్ఫేట్ అందుబాటులో ఉందన్నారు. ప్రాథమిక సహకార సంఘాలు,ఆగ్రో రైతు సేవా కేంద్రాలు, డీసీఎంఎస్‌తో పాటు ప్రైవేట్ దుకాణాల ద్వారా విక్రయిస్తున్నట్లు తెలిపారు. ప్రతి రైతు నుంచి ఆధార్ వివరాలు సేకరించి పీవోఎస్ మిషన్ ద్వారా ఎరువులు విక్రయించాలని షాపు యజమానులకు సూచించారు. కార్యక్రమంలో చేగుంట వ్యవసాయాధికారి హరిప్రసాద్ పాల్గొన్నారు.



మెదక్ జిల్లా చేగుంటలోని ఓ దుకాణంలో ఎరువుల బస్తాను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

# సాంకేతికతను ఉపయోగించి బోధించాలి

## మెదక్ జిల్లా విద్యాధికారి రాధాకిషన్

మెదక్ మున్సిపాలిటీ, మే 28: సాంకేతికతను ఉపయోగించి బోధించాలని మెదక్ జిల్లా విద్యాధికారి రాధాకిషన్ ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులను ఆకర్షించడానికి, చదువుపట్ల ఆసక్తి కలిగే విధంగా బోధనలో సాంకేతికతను జోడించి బోధించాలన్నారు. బుధవారం మెదక్‌లోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో కొనసాగుతున్న రెండో విడత భౌతిక రసాయనశాస్త్ర ఉపాధ్యాయుల శిక్షణ శిబిరాన్ని ఆయన సందర్శించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని పాఠశాలల్లో ఐఎఫ్‌టీ ప్యానల్స్ అందుబాటులో ఉన్నందున వాటిని ఉపయోగించి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో పాటు ఐదు రోజుల శిక్షణలో నేర్చుకున్న అంశాలను బోధనలో ఉపయోగించాలన్నారు. రిసోర్స్ పర్సన్లు సొంతంగా తయారు చేసిన బోధన అభ్యసన సామగ్రిని పరిశీలించారు. ప్రయోగాలు, కృత్యాలను వీడియో ద్వారా చిత్రీకరిస్తూ నేరుగా ఐఎఫ్‌టీ ప్యానల్స్‌లో వీక్షించే విధంగా సాఫ్ట్‌వేర్ అందుబాటులో ఉందని, ఉపాధ్యాయులు వినియోగించుకోవాలని సూచించారు. అంతకు ముందు డైట్ కళాశాలలో నిర్వహిస్తున్న జీవశాస్త్ర ఉపాధ్యాయుల శిక్షణ శిబిరాన్ని సందర్శించి లైవ్ ప్రయోగాలను అభినందించారు. ఆయన వెంట మెదక్ జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, కోర్సు కోఆర్డినేటర్ రేఖ, రిసోర్స్ పర్సన్లు రాజ్‌కుమార్, మహేందర్, వెంకటరమణ ఉన్నారు.



మెదక్‌లో ప్రయోగాలను పరిశీలిస్తున్న జిల్లా విద్యాధికారి రాధాకిషన్

# విత్తన కంపెనీల నకిలీలు

- మెదక్ జిల్లాలో రైతులను నిండా ముంచుతున్న మోసగాళ్లు
- పట్టించుకోని వ్యవసాయశాఖ అధికారులు
- నష్టపోతున్న కర్షకులు

మెదక్, మే 28 (నమస్తే తెలంగాణ) : ప్రతి సంవత్సరం ఖరీఫ్ సీజన్ వచ్చిందంటే చాలు నకిలీ విత్తనాలతో రైతులు కుదేలవుతున్నారు. వ్యవసాయశాఖ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడంతో విక్రయదారులు నకిలీ, నాసిరకం విత్తనాలను రైతులకు అంటగడుతున్నారు. పుట్టగొడుగుల్లా పుట్టుకువస్తున్న పలు కంపెనీలకు చెందిన డీలర్లు నకిలీ విత్తనాలను గ్రామాల్లో ఎక్కువగా విక్రయిస్తున్నారు. వ్యవసాయశాఖ అధికారులు విత్తనాల దుకాణాల్లో తనిఖీలు చేస్తున్నారే తప్పా గ్రామాల వైపు కన్నెత్తి చూడటం లేదనే విమర్శలు ఉన్నాయి. మెదక్ జిల్లాలోని పలు మండలాల్లో నకిలీ విత్తనాలు కొనుగోలు చేసిన కర్షకులు అనేక నష్టాలను చవిచూడాల్సి వస్తోంది. నకిలీ విత్తనాలను విక్రయించే వారిపై కఠిన చర్యలు చేపట్టకపోవడంతో ప్రతి సంవత్సరం రైతులు నట్టేటమునుగుతున్నారు. మెదక్ జిల్లాలోని ఆయా మండలాలు, డివిజన్ కేంద్రాల్లో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్, వ్యవసాయశాఖ అధికారులు ప్రత్యేక బృందాలతో తనిఖీలు చేపడుతున్నారు. తాజాగా నకిలీ విత్తనాలు విక్రయించే వారిపై పీడీ యాక్టు కింద కేసు నమోదు చేసేందుకు సిద్ధమవుతున్నారు.

### మెదక్ జిల్లాలో పంటల సాగు ఇలా...

మెదక్ జిల్లాలో ప్రజల ప్రధాన వృత్తి వ్యవసాయమే. జిల్లాలో సుమారు 3.50 లక్షల ఎకరాల్లో సాగు విస్తీర్ణం ఉంది. ఇందులో వరి 3,05,100 ఎకరాల్లో సాగు చేస్తుండగా, పత్తి 37,200 ఎకరాలు, మొక్కజొన్న 2,640 ఎకరాలు, కందులు 1,500 ఎకరాలు, పెసర్లు 1,500 ఎకరాలు, మినుములు 550 ఎకరాలు, జొన్నలు 100 ఎకరాలు, సోయాబిన్ 140 ఎకరాలు, కూరగాయలు 708 ఎకరాలు, ఆయిల్‌పామ్ 456 ఎకరాల్లో సాగవుతున్నాయి. జిల్లాలో ఎక్కువగా పత్తి పంట సాగు చేస్తుండడంతో కొంతమంది ప్రైవేట్ వ్యాపారులు పలు రకాల విత్తన కంపెనీల పేరుతో మార్కెట్‌లో విత్తనాలు విక్రయిస్తున్నారు. అందులో చాలా వరకు నకిలీ విత్తనాలను రైతులకు అంటగట్టి వ్యాపారులు సొమ్ముచేసుకుంటున్నారు.

### నకిలీ విత్తనాలు అరికట్టేందుకు చర్యలు...

మెదక్ జిల్లాలో 21 మండలాలు ఉన్నాయి. నకిలీ విత్తనాలు అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ఇప్పటికే అన్ని మండలాల వ్యవసాయశాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశామని మెదక్ జిల్లా వ్యవసాయాధికారి వినయ్‌కుమార్ 'నమస్తే తెలంగాణ'కు వెల్లడించారు. మండలానికో టాస్క్‌ఫోర్స్ కమిటీ ఏర్పాటు చేశామని, ఎక్కడా నకిలీ విత్తనాలు సరఫరా చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చినా వారిపై పీడీ యాక్టు ప్రయోగించడంతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కొత్తగా ఏర్పాటు చేసిన టాస్క్‌ఫోర్స్ కమిటీలో తహసీల్దార్, ఎస్సై, వ్యవసాయశాఖ అధికారులు ఉంటారన్నారు. వీరు ఆయా మండల కేంద్రాల్లోని విత్తనాలు, ఎరువుల దుకాణాలు, గోదాముల్లో తనిఖీలు చేస్తారన్నారు. ట్రాన్స్‌పోర్టుల వద్ద సైతం కమిటీ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహిస్తామన్నారు. గోదాములు, విత్తనాల డీలర్ల షాపుల్లో తనిఖీలు చేపడుతున్నామన్నారు.

### విత్తనాలు, ఎరువులకు రసీదు తప్పనిసరి..

విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసే సమయంలో రైతులు తప్పకుండా రసీదు తీసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. నష్టం వాటిల్లినప్పుడు రసీదు ఉంటేనే ప్రభుత్వం తరపున సాయం అందే వీలుంటుందని, లేదంటే నకిలీ విత్తనాలతో నష్టపోవాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారు. కొందరు గ్రామాలకు వచ్చి విత్తనాలు విక్రయించే వారు రైతులకు ఎలాంటి రసీదులు ఇవ్వకుండా విత్తనాలను అంటగడుతున్నారు. అవగాహన లేని కారణంగా రైతులకు నష్టం జరుగుతోంది. వ్యవసాయశాఖ అధికారులు, పోలీసు అధికారులు ప్రత్యేక నిఘా పెడితే తప్పా అక్రమాలను అరికట్టడం సాధ్యంకాదని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని, రైతులను నకిలీల నుంచి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.



మెదక్ జిల్లా నిజాంపేట మండలం కల్వకుంటలో గుర్తింపు లేని విత్తనాల దుకాణాన్ని సీజ్ చేస్తున్న పోలీస్, వ్యవసాయశాఖ అధికారులు (ఫైల్)